# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 24 నవంబరు, 2024 | పేజీలు :8


## రోడ్డు మధ్యలో ఉన్న సమాధి, దర్గాలను తొలగించాలి...



**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం సమీపంలో సుధ టిఫిన్ సెంటర్ పక్కన ఉన్న దర్గాను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక వివేకానంద విగ్రహం నుంచి మజీద్ వరకు గత ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు పనులు సక్రమంగా జరగలేదని ఆరోపించారు. రోడ్డు మధ్యలో వచ్చిన దర్గాను తొలగించలేదని, కాంట్రాక్టర్ ఇష్టారీతిగా పనులు చేశారని గ్రామస్తులు ఆరోపించారు. రోడ్డు మధ్యలో దర్గా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిని తొలగించాలని డిమాండ్ చేస్తు గ్రామస్తులు ధర్నా, రాస్తారోకో చేశారు. అలాగే మండల అభివృద్ధి అధికారికి, మండల తహసీల్దార్, నందిపేట్ ఎస్ఐకి గ్రామ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రామ్‌నగర్ కాలనీ వాసులు కలిపి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని వీరు కోరుతున్నారు.

# చిన్నారులందరికీ నాణ్యమైన పౌష్టికాహారం అందివ్వాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అంగన్వాడీల్లోని చిన్నారులందరికీ నాణ్యమైన పౌష్టికాహారం అందివ్వాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శనివారం పట్టణంలోని నాయిడివాడలో గల అంగన్వాడీ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,అంగన్వాడీలలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. అంగన్వాడీల్లో తరగతి గదులు చిన్నారులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. చిన్నారులకు అధిక సంఖ్యలో ఆటవస్తువులు, బొమ్మలు అందుబాటులో ఉంచాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజన్నాన్ని అందించాలన్నారు.వంటకు నాణ్యమైన సరుకులను కూరగాయలను మాత్రమే వినియోగించాలన్నారు. చిన్నారులకు అంగన్వాడి కేంద్రంలో స్వచ్ఛమైన త్రాగునీరు అందివ్వాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. అంగన్వాడీ పరిసరాలలో దోమలు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రపరచాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువును నేర్పించాలని తెలిపారు. అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. గర్భిణీ స్త్రీల యొక్క ఆరోగ్య స్థితి లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులతో నెలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని సూచించారు. చిన్నారుల ఎత్తు, బరువు ఇతర వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యవంతమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. తరగతి గదుల్లో సున్నాలు వేయించి అన్ని వివరాలు తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ పరిశీలనలో సిడిపిఓ నాగమణి,తాహసిల్దార్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం వైద్య శాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షించారు. మొత్తం ప్రసవాల్లో 20 శాతం ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేలా చూడాలన్నారు. గర్భిణీ అయినప్పటి నుంచి వారి పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గర్భిణీలకు సాధారణ ప్రసవంపై నమ్మకం కలిగేలా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. వంద శాతం గర్భిణీల రిజిస్ట్రేషన్లు నమోదు చేయాలని, వారికి చేస్తున్న వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి గర్భిణీకి తగిన మోతాదులో మందులు అందజేసి రక్తహీనత నివారించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలను తప్పకుండా పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఆర్ఎంపి క్లినిక్‌లను రెండు నెలలకు ఒకసారి సందర్శించాలని తెలిపారు. ఆర్ఎంపిలు వారికి అనుమతి ఉన్నమేరకు మాత్రమే వైద్యం చేయాలన్నారు. ఆశాలు, ఏఎన్ఎంలు గర్భిణీలకు సంబంధజంచిన ఎల్ఎంపి సర్వేను పకడ్బందీగా చేయాలని, వైద్యశాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ సర్వే తీరును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, అడిషినల్ డిఎంహెచ్‌వో సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, డిటిసివో రవీందర్, డిఐవో సాజిదా, ఉమశ్రీ పాల్గొన్నారు.

### విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు

# పెంపునకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలలో, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపుకు కృషి చేయాలనీ ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కే.జీ. టు పీ.జీ మరియు దమ్మన్నపేట లోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ శనీవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు అంశాల పై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వారి సందేహాలు నివృత్తి చేశారు. పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థుల హాజరు పై ఆరా తీశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో నిష్ణాతులను చేయాలని సూచించారు. అనంతరం విద్యాలయం ఆవరణలో పరిశుభ్రత పనులు పరిశీలించారు. అనంతరం కిచెన్ లోకి వెళ్లి, కూరగాయలు, పండ్లు ఇతర పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పలు కూరగాయలు, పండ్ల నాణ్యత లను పరిశిలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్ళారు. ఉపాధ్యాయురాలు పాఠాలు బోధిస్తుండగా పరిశీలించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.



## కనీస మద్దతు ధర చట్టం చేయాలి..



**ప్రజాపక్షం/భైంసా:**రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.రాజు డిమాండ్ చేశారు.శనివారం నవంబర్ 26 నాడు దేశవ్యాప్తంగా జరిగే ప్రజా ,రైతు, కార్మిక నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని కుమీర్ లో ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం 13 నెలల డిల్లీ రైతు దిగ్బంధనం ముగింపు సందర్భంగా రైతాంగానికి ఇచ్చిన లిఖితపూర్వక హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.రైతులు తాము చెమటోడ్చి పండించిన పంటలకు మాత్రమే గిట్టుబాటు ధర అడుగుతున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం రైతా ంగాన్ని ముంచుతూ,కార్పొరేట్ శక్తులకు రైతుల యొక్క రక్త మాంసాలను అమ్మాలని చూస్తున్నదని విమర్శించారు.కార్మికుల ,రైతుల యొక్క సమస్యలు పరిష్కారం చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ భైంసా డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, రైతులు,కార్మికులు పాల్గొన్నారు.

## పిఎం విశ్వకర్మ సర్టిఫికెట్లు అందజేత..

**ప్రజాపక్షం/నేరడిగొండ:**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల ఆధ్వర్యంలో పటిష్టంగా అమలవుతున్న పీఎం విశ్వకర్మ నూతన లబ్ధిదారులకు అన్ని రకాల శిక్షణను ఇచ్చి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి,సిబ్బంది,లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

## మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**తెలంగాణ ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అజార్ హుస్సేన్ కురానపేట్ కౌన్సిలర్ నల్లూరి పోశెట్టి,మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.భవిష్యత్తులో సొసైటీ మరెన్నో కార్యక్రమాలు చేయాలి దానికి మేము ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వపరంగా పథకాలను మహిళలకు అందేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ హబీబ్ జిలాని,సోసైటి స్థాపకుడు అధ్యక్షుడు షేక్ ముజాహిద్,అలన్సర్ ఎడ్యుకేషనల సోసైటీ అధ్యక్షుడు ఇఫ్తేఖర్ ఆన్సరి ఉపాధ్యక్షుడు సాజీద్,సొసైటీ సభ్యులు అఫ్రోజ్ ఖాన్ ,జనరల్ సెక్రటరీ అల్మాస్,సుబేర్,అజహర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలను కాల్చొద్దు: ఏవో



**ప్రజాపక్షం/ మోర్తాడ్:**యాసంగికి సమయత్తం అవుతున్న రైతులు వరి కొయ్యలను కాల్చి వేయవద్దని మోర్తాడ్ మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ సూచించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో రైతులకు పలు విషయాలను తెలియచేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని వివిధ గ్రామాలలో వానకాలం వరి కోతలు చివరి దశకు వచ్చి యాసంగి పంటలకు సమాయత్తం అవుతున్న రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి పంట కోసిన తరువాత వరి కొయ్యలను కాల్చి వేయవద్దని సూచించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలతో పాటు పర్యావరణం పైన చెడు ప్రభావం పడుతుందన్నారు. మట్టిలోని సూక్ష్మ జీవులు తగ్గిపోవడం, విలువైన పోషకాలు ఆవిరైపోవడం, మట్టికి తేమని పట్టుకొని ఉండే గుణం తగ్గిపోవడం వంటి నష్టాలు ఎన్నో ఉన్నాయని, ప్రత్యామ్నయంగా వరి కొయ్యలను ఎస్ఎస్పి లాంటి ఎరువులను వాడి పొలంలోనే కుళ్లిపోయేలా చేసినట్లయితే, భూసారం పెరిగి వచ్చే పంటకాలం మంచి దిగుబడి సాధించుకోవచ్చని ఆయన తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులకు ఈ విషయంలో ఏదైనా సందేహం ఉంటే స్థానిక వ్యవసాయ విస్తరణఅధికారులను సంప్రదించవచ్చని ఏవో హరీష్ కుమార్ తెలిపారు.

## ఈడబ్ల్యుఎస్ రద్దు అయ్యేవరకూ పోరాటం ఆగదు

### నరెడ్ల శ్రీనివాస్...



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ :** ఈడబ్ల్యుఎస్ రద్దు అయ్యేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మంచిర్యాల జిల్లా బిసి జాగృతి అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ బిసి జాగృతి ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య 85 జయంతి వేడుకను మంచిర్యాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేయాల్సిందినగా ఆయన బిసి కుల సంఘాలను కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న బిసి కుల జన గణన ఏ అవకతవకలు లేకుండా నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బిసిల ఆకాంక్ష అయిన చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లులో కూడా బిసి మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ బిసి యువతి యువకులకు, విద్యార్థులకు ఈ డబ్ల్యుఎస్ కారణంగా విద్య, ఉద్యోగాలలో అ న్యాయం జరుగుతుందని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సీనియర్ నాయకులు పడాల రామన్న, పెద్దపల్లి సూరన్న, ఏదునూరి రమేష్, రాజేశ్‌గౌడ్, మంచర్ల సదానందం పట్టణ ప్రధాన కార్యదర్శి , ఉపాధ్యక్షుడు బియ్యాల సత్తయ్య పాల్గొన్నారు.

## అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి



**ప్రజాపక్షం/రామగిరి:** సెక్యూరిటీ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని కార్పొరేట్ సెక్యూరిటీ విభాగం జనరల్ మేనేజర్ సిహెచ్.లక్ష్మీ నారాయణ అన్నారు. శనివారం రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో వారు పర్యటించారు. ముందుగా రామగుండం3 ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతిని కలిసి ఏరియాలో సెక్యూరిటీ పరంగా చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ జనరల్ మేనేజర్ గా బాధ్యతలను స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఏరియాలో పర్యటించిన సందర్భంగా ఇంచార్జ్ జి.యం. రఘుపతి ఇతర అధికారులతో కలిసి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్, ఓసిపి 1, 2 ఉపరితలగనులలో ఉన్న చెక్ పోస్టులు, స్టోర్స్, స్క్రాప్ యార్డ్, వ్యూపాయింట్లను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ యొక్క ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాత్ర కీలకమని, గనులు, విభాగాలలో సింగరేణికి సంబంధించిన సామగ్రి దొంగతనం జరగకుండా చూడాలని అన్నారు. సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తూ, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వారి పర్యటనను పురస్కరించుకొని ఏరియా సెక్యూరిటీ, పర్సనల్ విభాగం, ఓ.సి2 గని అధికారులు వారిని సన్మానించారు.పర్యటనలో భాగంగా వారితోపాటు అడ్రియాల ప్రాజెక్ట్ అధికారి కొలిపాక నాగేశ్వరరావు, ఓ.సి.2 ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.వెంకటరమణ, ఏరియా సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, అధికారులు కె.చంద్రశేఖర్, గుర్రం శ్రీహరి, పి.రాజేశం, మథిన్ హుస్సేన్, జూనియర్ ఇన్స్ పెక్టర్ టి.లింగయ్య, ఇతర సెక్యూరిటి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల అంచంచలమైన విశ్వాసానికి నిదర్శనం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** భారతీయ జనతా పార్టీ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ జగిత్యాల ఆధ్వర్యంలో స్థానిక తాహసిల్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా.బోగ శ్రావణి. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ ఎంవిఏ యొక్క బూటకపు వాగ్దానాలను తిరస్కరించినందుకు మరియు అభివృద్ధి, శ్రేయస్సు కోసం బిజెపి మహాయుతి కూటమి యొక్క దార్శనికతను ఎంచుకున్నందుకు మహారాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ప్రజలు కాంగ్రెస్ కంటే బిజెపితోనే అభివృద్ధి చెందుతుంది అని తెలుసుకున్నారు. ఈ నిర్ణయాత్మక విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై ప్రజల అచంచలమైన విశ్వాసాన్ని నిదర్శనంగా నిలుస్తుంది, ఇది నిరంతరంగా శూన్య వాక్చాతుర్యం కంటే పురోగతి మరియు వృద్ధికి ప్రాధాన్యతనిస్తుంది.

ఈ కార్యక్రమంలో జగిత్యాల్ పట్టణ మాజీ అధ్యక్షులు వీరభత్తిని అనిల్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, సిరికొండ రాజన్న, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, పట్టణ ఇంచార్జ్ మ్యాదరి అశోక్, జిల్లా కోశాధికారి దశరథ్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు రాజేందర్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షులు దూరిశెట్టి మమత, మహిళా మోర్చా నాయకురాలు భారతీయ జనతా పార్టీ పట్టణ మరియు జగిత్యాల నియోజకవర్గం పదాధికారులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు సీజ్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:**అనంతారం గ్రామంలోని రోడ్డం వాగు లో కొన్ని నెలలుగా ఇసుక దందా జోరుగా కొనసాగుతుందని జగిత్యాల రూరల్ మండల రెవన్యూ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో జగిత్యాల రూరల్ మండల ఎంఆర్ఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండల రెవన్యూ అధికారులు అనంతారం గ్రామంలోని రోడ్డం వాగులోఅక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని జగిత్యాల రూరల్ మండల కార్యాలయంలో తరలించారని సమాచారం. ఆ ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న జగిత్యాల రూరల్ మండల రెవన్యూ అధికారులు కేసు నమోదు చేస్తారా లేక జరిమానా విధిస్తారా అని అనే దానిపై స్పష్టత రాలేదని పలువురు మాట్లాడుకుంటున్నారనీ తెలిసింది.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గిరిజన సంక్షేమ శాఖా ఉప సంచాలకులు రమాదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా లోని మొత్తం 52 వసతి గృహాలో నాణ్యమైన భోజనం అందించాలని, ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు హెడ్ క్వార్టర్లో ఉండి విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పదవ తరగతిలో ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, దీని కోసం వంద రోజుల ప్రణాళిక స్పెషల్ యాక్షన్ ప్లాన్ అములు చేయాలని, జిసిసి నుండి వచ్చే సరుకులు చూసి నాణ్యమైనవి ఉంటేనే తీసుకోవాలని లేకుంటే తీసుకోవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితిలో వసతి గృహ విద్యార్థులకు బయటి నుండి వచ్చే తిను బండారాలు అనుమతించకూడదని, వంటశాల పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎఎంసిఒ పుర్కా ఉద్ధవ్, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, జిసిడిసిఒ శకుంతల, ఎటిడిఒలు ఖమర్ హుసేన్, శ్రీనివాస్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా విజయోత్సవాల కార్యక్రమం వాయిదా

### - జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:**మంథని ప్రాంతంలో నవంబర్ 24న జరగాల్సిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నవంబర్ 25కు వాయిదా పడిందని జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా నవంబర్ 24న మంథని లో జరగాల్సిన ప్రజా ప్రభుత్వం పిలిచింది కార్యక్రమం నవంబర్ 25 వాయిదా పడిందని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 25న మంథని శివ కిరణ్ గార్డెన్స్ లో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రత్యేక ఓటర్ న మోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ రాజబా బు తెలిపారు. శనివారం ముత్తారం మం డలంలోని అడవి శ్రీరాంపూర్,ముత్తారం, ఓడేడు గ్రామాలతో పాటు మండల వ్యా ప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూతులలో ఓటర్ నమోదు పై ప్రత్యేక కా ర్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆర్ఐ రాజబాబు పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బిఎల్ఓ ల ద్వారా పోలింగ్ బూతులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నూతన ఓటు, చేర్పులు మార్పులు తదితర విషయాల ను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఫారం6 లో 18 స ంవత్సరాలు నిండిన వారు ఓటును నమోదు చేసుకొనుట, ఫారం7 లో తొలగింపులు, మృతి, డబుల్ ఎంట్రీ,అదేవిధంగా ఫారం8 చేర్పు లు మార్పులు లను బి ఎల్ ఓ ల దగ్గరకు వెళ్లి మార్పు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఈ ప్రత్యేక ఓటర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాజన్న తోపాటు బిఎల్వోలు పాల్గొన్నారు.

## యుపిఎస్‌సి ఫలితాల్లో ముధోల్ వాసి ప్రభంజనం..



**ప్రజాపక్షం/ముధోల్** :మండల కేంద్రంలోని ముధోల్ వాసి సందీప్ వాఘ్మారే ఇటివల విడుదలైన యుపిఎస్సి ఫలితాల్లో ఆల్ ఇండియా 45వ ర్యాంకు సాధించి అందరికి ఆదర్శంగా నిలిచాడు,నిరుపేద కుటుంబంలో జన్మించి అత్యున్నత స్థానాలు అధిరోహించడం ముధోల్ వాసులకు గర్వమని తెలిపారు.10వ తరగతి విద్యనసభ్యసించిన పిదప రాష్ట్రంలోని బాసరలో కొలువుతీరిన ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించి 2014 లో ఇండియన్ రైల్వేలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఉద్యోగం సంపాదించాడు.తదనంతరం 8 సంవత్సరాల తరువాత టిఎస్‌పిఎస్సి పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాల్లో సైతం ప్రతిభ చాటాడు నేడు యూపీఎస్సి ఫలితాలో ర్యాంకు సాధించి గ్రామస్తులు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచాడు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహా పాదయాత్ర

**ప్రజాపక్షం/వీణవంక**:తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహా పాదయాత్ర ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారుల కృషి మరువలేనిదని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు సరైన గుర్తింపునివ్వలేదని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి, యువజన కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఊకంటి మల్లాచారి, రావుల రాజబాబు, ఆరె రమేష్ రెడ్డి, వినయ్, శ్రీకాంత్, రాజేందర్ తదితరులున్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/-రామ గిరి** : రామగిరి మండలం కల్వచర్ల మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అసం తిరుపతి అక్క సుద్దాల పద్మ మృతి చెందగా ఆమె కుటుంబసభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించి ఆమె మృతి పట్ల ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంటబిఆర్ఎస్ నాయకులు జక్కు రాకేష్, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు శంకేషి రవీందర్,నాయకులు పూదరి సత్యనారాయణ గౌడ్, కాపరబోయిన భాస్కర్, మేడగోని రాజన్న, మట్ట బైరెడ్డి, సైన్ల సత్యం, జాపతి శేఖర్, ఆసం రాము, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి ఒకచోట, తవ్వకాలు మరోచోట.?

### - పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/ముత్తారం** : అనుమతి మాటున మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేపట్టడంపై ముత్తారం మండలంలోని ఖమ్మం పల్లి గ్రామానికి చెందిన తీర్థాల కొమురయ్య అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తీర్థాల కొమురయ్య మాట్లాడుతూ ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని సందరెల్లి అటవీ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అనుమతి మాటున ఇష్టరాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని వారు అన్నారు. మట్టి తవ్వకాల కోసం తెలంగాణ ప్రభుత్వ గనుల, భూగర్భ శాస్త్ర శాఖ మైనింగ్ అధికారులు ఇచ్చిన పర్మిషన్ లొకేషన్ స్థానిక తాసిల్దార్ అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఇవేమీ పట్టనట్లుగా సంబంధిత మట్టి తవ్వకాల కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారని కొమురయ్య అన్నారు. తను గతంలో తన సొంత భూముల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్న సమయంలో రెవిన్యూ అధికారులు వచ్చి ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ లో పెట్టి కేసు నమోదు చేసి రెండు నెలల పాటు ఇబ్బందులకు గురిచేయడం జరిగిందని మరి ఇప్పుడు ప్రభుత్వ భూమి చెరువు శిఖం పక్కనే మట్టి తవ్వకాలు చేపడుతున్న అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అనుమతి మాటును అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న పనులను నిలిపివేయాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తీర్థాల కొమురయ్య తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలలో దళారుల పాగా



**ప్రజాపక్షం /మల్లాపూర్** : గతంలో ఎన్నడు లేని విధంగా రైతులు పండించిన ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో అదనుగా భావించిన దళారులు ప్రభుత్వమే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ఏకంగా పాగా వేసి ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించేందుకు తరలించగా, దళారులు అక్కడికి చేరి రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొనుగోలు చేస్తూ లాభార్జన పొందుతున్నారు. కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారులు కుమ్మక్కై కేంద్రాలలో తూకంలో జాప్యం చేయడంతో దళారులు గద్దల్లా వాలిపోతూ ధాన్యాన్ని కొనుగోలు చేసి తన్నుకుపోతున్నారు. ఇలా ప్రభుత్వం రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఏదో న్యాయం చేస్తారనుకుంటే ఇష్టం ఉన్నచోట అమ్ముకోవచ్చని ప్రకటించగానే దళారులు కేంద్రాలలోనే కొనుగోలు చేస్తున్నారు. ఇలా దళారులకు కేంద్రాల నిర్వాహకులకు వాగ్వాదాలు జరిగిన సందర్భాలు ఉండడంతో ఇలా అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎందుకని బాహాటకంగానే రైతులు విమర్శిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు చుట్టపు చూపుగా వచ్చి ఏమి చేయలేక నామమాత్రపు తనిఖీలు చేసి వెళ్లిపోతుండడం విశేషం. దళారుల ఇష్టారాజ్యంతో రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతలు అడుగడుగునా నష్టపోతున్నారని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా చూస్తారో లేదో వేచి చూడాలి...

## వ్యవసాయ కూలీలకు జీవన భృతి

### ఎఐపికెఎంఎస్ నాయకుడు రాజేశ్వర్



**ప్రజాపక్షం/ఎడపల్లి**:తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా వ్యవసాయ కూలీలకు జీవనభృతిగా ఏడాదికి రూ. 12వేలు ఇస్తానని చెప్పి పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయడం లేదని, వాటిని వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేది నుంచి డిసెంబర్ 2వ తేది వరకు నిర్వహించే నిరసన, ధర్నా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని ఏఐపికెఎంఎస్ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం రెంజల్ మండంలోని నీలా గ్రామంలో కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కూలీ ద్వారా వచ్చే ఆదాయంపై బ్రతికే వ్యవసాయ కూలీలకు, మూడు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు కూడా కూలీపై ఆధారపడుతున్నారు. వీరందరికీ జీవనభృతి ఇవ్వాలని, గీత, చేనేత, బీడీ తదితరులకు ఇస్తున్న నెల పెన్షన్ రూ. 2000ల ప్రకారంగా వ్యవసాయ కూలీలకు, సంవత్సరానికి రూ. 24వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నెలకు రూ. నాలుగు వేల ఇస్తానన్న హామీ ప్రకారం అంటే ఏడాదికి రూ. 48వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఒడ్డెన్న,మండల కార్యదర్శి షేక్ నసీర్, ఎల్.గంగాధర్, సిద్ధ, పోశెట్టి, ఆజన్న, తరుణ్, ఎల్.సాయిలు, చిన్న గంగాధర్, ప్రమీల, మమత, వీరమణి, వందన, లింగామణి, తొంటి సాయమ్మ, సరుబాయి, పోసాని తదితరులు పాల్గొన్నారు.

## ''మన ఊరు.. మన కాంగ్రెస్'' కార్యక్రమానికి శ్రీకారం

### గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

### సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రణవ్





**ప్రజాపక్షం/వీణవంక**:గ్రామ సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, దాంట్లో భాగంగానే మన ఊరు మన కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో తొమ్మిది లక్షల 20 వేల విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. పేద ప్రజలకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మన ఊరు మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలకు, ప్రజలకు భరోసానిస్తూ గ్రామంలోని ప్రధాన సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమగ్ర కులగణన సర్వేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దీనిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వీణవంక మండలానికి సంబంధజంచి ఇప్పటికే రూ.78 లక్షల అభివృద్ధి నిధులు మంజూరు చేశామని, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ వచ్చాయని, రాబోయే కాలంలో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాలువ నిర్మాణానికి ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం / చందుర్తి** : రుద్రంగి రీడ్జ్ నుండి లచ్చపేట తండా రిజర్వాయర్ నింపడానికి అవసరమైన కాలువ నిర్మాణానికి మండలంలోని సనుగుల గ్రామంలో శనివారం ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భూమి పూజ చేశారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే ప్రాజెక్టులలో శ్రీపాద ఎల్లంపల్లి మొదటి ప్రాధాన్యతలో ఉందన్నారు. గత ప్రభుత్వ హాయంలో నిర్లక్ష్యనికి గురై, 10 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.లచ్చపేట తండా ప్రాజెక్టు త్వరలోనే పూర్తి చేస్తామని,ఎర్ర చెరువు,పటేల్ చెరువులను నీటితో నింపుతామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం** : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు అమ్మక్కపేట, ఎర్దండి గ్రామాల్లో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ జి. ప్రసాద్ పరిశీలించారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ట్రాక్ సీట్ డేటా ఎంట్రీ వెనువెంటనే పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, తిమ్మాపూర్, ఫకీర్ కొండాపూర్, గ్రామాల్లో ఓటర్ల ప్రత్యేక సవరణ కేంద్రాలను తహశీల్దార్ పరిశీలించి బిఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

## పొలం బాటలో విద్యుత్ అధికారులు




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్** : రచ్చపల్లి గ్రామం ,ధర్మారం మండలం లో శనివారం రోజున విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ కంకటి మాధవరావు వినియోగదారులతో మాట్లాడుతూ గ్రామం లో విద్యుత్ సమస్యలు ఉన్నాయా అని రైతులతో మాట్లాడుతూ వివరాలు తెల్సుకున్నారు .రైతులు వారి పొలాల వద్ద స్టార్టర్లు, ఫ్యూజులు, స్టార్టర్ బాక్సులు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు, మోటర్ లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. విద్యుత్ పరంగా ఏమైనా సమస్యలుంటే విద్యుత్ సిబ్బందికి మరియు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సమాచారం అందించాలని సూచించారు.రైతులు లోవోల్టేజి సమస్య రాకుండా కెపాసిటర్లు బిగించుకోవాలని, కెపాసిటర్ మోటార్లకు ఉంటె మోటార్ మన్నికగా ఎక్కువ కలం పనిచేస్తాయని లో వోల్టాజి సమస్యలు కూడా ఉండవని తెలిపారు . వంగిన స్థంబాలు , లూస్ లైన్లు , పాడైన ఐరన్ స్తంబాలు , లో వోల్టాజ్ సమస్యలు ఉన్న సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ గారికి గాని విద్యుత్ సిబ్బందికి అందించాలని సూచించారు. ఇప్పటి వరకు రచ్చపల్లి గ్రామం లో 127 స్తంభాలను లూస్ లైన్లను సరిచేయడం కోసం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు . పొలాల చుట్టు అక్రమంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని, తద్వారా రైతులు, పశువులు విద్యుత్ ప్రమాదాలకు గురికా కుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ కంకటి మాధవరావు పెద్దపల్లి డివిజనల్ ఇంజనీర్ శ్రీ దాసరి తిరుపతి,డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ శ్రీ బి. రవి ,శ్రీ విజయ్ గోపాల్ సింగ్ ఎడిఇ ,శ్రీ మహిపాల్ రెడ్డి ఎఇ మరియు సెక్షన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/నిజాంసాగర్/పిట్లం:** పిట్లం మండలంలోని కోమటిచెర్వుతాండా బీఆర్ ఎస్ పార్టీ నాయకుడు నునావత్ హరిచంద్ గత రెండు రోజుల క్రీతం మరణించాడు. విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, పిట్లం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాసరి రమేష్, మాజీ జడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డితో కలిసి మృతుని ఇంటికి వెళ్ళి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి తాను అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. హన్మంత్‌షిండే వెంట మాజీ జడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, రాంపూర్ మాజీ సర్పంచు నారాయణ రెడ్డి, చిల్లర్గి సొసైటీ డైరెక్టర్ శ్రీరాం, పిట్లం మాజీ ఏఎంసీ డైరెక్టర్ కె.రవీంధర్‌నాయక్, మాజీ సర్పంచు దేవారావు, పార్టీ నాయకులు హన్మంతురావు, సవాయిసింగ్, శ్రావణ్ కుమార్, శంకర్, ఎల్లయ్య, లిబియానాయక్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మక్కపేటలో ఆర్‌డిఒ పర్యటన




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో శనివారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశుభ్రంగా వంటలు చేయాలని సూచించారు. ఓటర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించి బిఎల్‌వోలకు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీవో మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం ఇప్పటివరకు మిల్లులకు ఎంత తరలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పంపించాలని నిర్వాహకులకు సూచించారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి..

**ప్రజాపక్షం/ముధోల్(బాసర) :** బాసర ట్రిపుల్ ఐటీలో వరుసగా జరుగుతున్న ఆత్మహత్యల ఘటనలు నిరోధించడానికి తగు చర్యలు తీసుకోవాలని వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ ని బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్‌నాథ్ రాథోడ్ విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీసీ గోవర్ధన్ ను నియమించినందుకు వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు.ప్రభుత్వ ఫలాలు విద్యార్థులకు అందజేయాలనీ కోరారు.రాబోయే రోజుల్లో సమస్యలు పునరావృతం కాకుండా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి



**ప్రజాపక్షం/బోధన్:** విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలంటే విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలని బిహేవియర్ స్కిల్స్ కోచ్ సుధీర్ సండ్రా అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ఇందూర్ హై స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ ఆధ్వర్యంలో 8,9,10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిహేవియర్ స్కిల్స్ కోచ్ సుధీర్ సండ్రా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థి దశ నుంచి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం సాధించే వరకు కృషి చేస్తూ ఉండాలని అన్నారు. నేటి సమాజంలో జరుగుతున్న చెడు అలవాట్లు ఎలా దూరం చేయాలో ఎల్ఈడీ స్క్రీన్ లో ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. జీవితంలో గెలుపు ఓటములు సహజంగా వస్తూ ఉంటాయని ఓడిపోయిన వారు నిరాశ చెందకుండా మరోమారు గెలుపు కోసం ప్రయత్నిస్తే తప్పకుండా గెలుస్తారని అన్నారు. పిల్లలు ఎప్పుడు వారి జీవితంలో ఐదుగురిని గురువుగా భావించాలని వారు మొదట తల్లిదండ్రులైతే మూడవ గురువు టీచర్లని నాలుగవ గురువు దేశ సైనికులను, ఐదవ గురువు రైతులు అని అన్నారు. నేటి సమాజంలో పిల్లల చదువు కోరకు తల్లిదండ్రులు ఆరంగారాలు కష్టపడి చదివిస్తుంటే ఎదిగిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో ఏర్పించడం చాలా బాధాకరమని అన్నారు. నేటి సమాజం వృద్ధాశ్రమాలు లేని సమాజానికి కృషి చేయాలని విద్యార్థులను ఆయన కోరారు. తల్లిదండ్రులు దగ్గర ఉన్నప్పుడు తెలియని విలువ దూరం అయిన తరువాత తెలుస్తుందని తల్లిదండ్రులు లేని బాధను ఎవరూ అనుభవించకూడదని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ట్రస్మ జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ మోటివేటర్ స్పీకర్ సుధీర్ సండ్రాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు, వి ద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో కులగణన చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఆది మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. చట్ట సభల్లో బిసి రిజర్వేషన్లను 50 శాతంకు పెంచాలని, పార్లమెంటులో తక్షణమే బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 న హైదారాబాద్ రవీంద్రభారతిలో జరగనున్న బిసిల సమరభేరికి జిల్లా నుండి అన్ని వర్గాల బీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమరభేరి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీమాన్, మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరోజ సత్యనారాయణ, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు నోమూరి శ్రీధర్ రావు, బీసీ సంఘం నాయకులు ఆకుల స్వామి వివేక్ పటేల్, భూషణ వేణి రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్, మేడగోని శ్రీనివాస్ గౌడ్ , వేల్పుల మల్లికార్జున రావు, ఇల్లందుల అంజిబాబు, తూముల శ్రీనివాస్, కంకటి శ్రీనివాస్, మంద భాస్కర్, బొద్దుల అరుణ, శైలజ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దళితులను మోసం చేసింది బిఆర్ఎస్ పార్టీనే



**ప్రజాపక్షం/వీణవంక:** దళితబంధు విషయంలో పూటకో మాట మాట్లాడే కౌశిక్‌రెడ్డి ముందు తాను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న ఫోటోను చదవమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హితవు పలికారు. వీణవంక మండలం బొంతుపల్లి గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చదువురాని వ్యక్తి చేసే పనులు అన్ని ఇలాగే ఉంటాయని, ఎమ్మెల్యేగా చెప్తున్నట్లుగా ఆ లెటర్‌లో దళిత బంధు ఇవ్వమని, ఆపమని ఎక్కడా లేదన్నారు. అందుకు సంబంధించిన డబ్బులకు వడ్డీ పడే విషయంలో సైబర్ క్రైమ్ నేరగాళ్లు దోచుకునే అవకాశం ఉన్నందున అలాంటి సైబర్ క్రైమ్ బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అకౌంట్లను వెరిఫై చేసి స్టేటస్ కో మెయింటెన్ చేయమని మాత్రమే చెప్పారని తెలిపారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి జూన్‌లో వచ్చిన లెటర్‌ను ఇప్పుడు వైరల్ చేస్తూ దళితులను తప్పుదోవ పటిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులను కాదు... ముందు కౌశిక్‌రెడ్డిని హుజురాబాద్ నుంచి బహిష్కరించాలన్నారు. అసలు హుజురాబాద్‌లో దళిత బంధు ఆగిపోవడానికి ప్రధాన కారణం కౌశిక్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క డబుల్ బెడ్‌రూం , దళితబంధు , కొత్తరేషన్ కార్డులు , దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వనందుకు గ్రామాల్లో తిరగనియ్యొద్దని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి అధికారం పోయి పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా మారడం లేదన్నారు. మరోసారి కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఫైబర్ ఎయిర్టెల్ నెట్ ద్వారా వినియోగదారులకు సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం రాత్రి పెద్దపల్లి పట్టణంలో ఎయిర్టెల్ ఎక్స్ స్ట్రీమ్ ఫైబర్ నెట్వర్క్ ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు గ్రామ గ్రామాన ఫైబర్ నెట్వర్క్ సేవలందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఇంటిలో నెట్ ద్వారా వివిధ కార్యక్రమాలు మరియు ఆన్లైన్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని స్పష్టం చేశారు. వినియోదారులకు ఎక్కువ సేవలు అందించి తక్కువ ధరకు కనెక్షన్లు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఫైబర్ నెట్ నిర్వాహకులు పిల్లి శేఖర్ మాట్లాడుతూ వినియోగదారులకు తక్కువ ధరలో అనగా 2500 రూటర్ తోపాటు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. హై స్పీడ్ లో ఈ నెట్వర్క్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అట్లూరి లక్ష్మణ్ కుమార్, తోపాటు ఫణిందర్, వెంకటేష్ ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** సెర్ప్ ఐకేపీ ద్వారా అమలు చే సే అన్ని రకాల కార్యక్రమాలు వేగవంతం చేయాలని జిల్లా ఫైనా న్స్ డిపిఎం విజయ భారతి అన్నారు. శనివారం రోజున జగిత్యా ల మండలం ఐకేపీ కార్యాలయంలో మండల సిబ్బందితో సమీ క్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిపి ఎం విజయ భారతి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ, మహిళా శక్తి కార్యక్రమాలు, సంఘాలలో లేని సభ్యులను సంఘాల్లో చేర్పించడం, ఎంటర్ ప్రైజేషన్, లకపతి దీదీ, లోకోస్ యాప్ ఎంట్రీ తదితర అంశాలను సిబ్బంది ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, గ్రామ సంఘాలు, స్వశక్తి సంఘాల పుస్తకాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని డిపిఎం విజయ భారతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియం వి.గంగాధర్, సి.సి.లు పి.గంగారాం, బి.మరియా, బి.రవీందర్, పి.వి ద్యాసాగర్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాడు తండ్రి.. నేడు తల్లి మృతితో అనాధగా మారిన చిన్నారి



**ప్రజాపక్షం/కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో తల్లిదండ్రుల మృతితో 9వ తరగతి చదువుతున్న ఇస్లావత్ నవ్యశ్రీ అనే అమ్మాయి అనాధగా మారింది. వివరాల్లోకి వెళ్తే నిమ్మపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ భాస్కర్, భారతి దంపతులకు నవ్యశ్రీ అనే కూతురు కలదు. సంతోషంగా బ్రతుకుతున్న వీరి జీవితాన్ని విధి వక్రీకరించింది. భాస్కర్ గత నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, భారతి తన కూతురితో కలిసి జీవిస్తుంది. ఇదే క్రమం లో భారతి(35) అనారోగ్యానికి గురి కావడంతో హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. తన కూతురు నవ్యశ్రీ అనాధగా మారింది. కోనరావుపేట మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నవ్యశ్రీ గుండెలు పగిలేలా రోధిస్తున్న తీరు చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. నవ్యశ్రీని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మృతురాలి కుటుంబానికి సహకారం

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలంలోని లొంక కేసారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కారుపాకల స్వరూప కుటుంబానికి రామగిరి సేవాసమితి సభ్యుల సహకారంతో వారి కుటుంబ సభ్యులు కారుపాకల కిరణ్ రాయ మల్లమ్మలకు బెల్లం శ్రీనివాస్ జ్యోతి , శివ రైస్ మిల్ శేఖర్ మరియు రామగిరి సేవా సమితి సభ్యుల సహకారంతో 50 కేజీల బియ్యం మరియు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను శనివారం అంద చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి సేవా సమితి సభ్యులు గంట వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్ బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/రామడుగు:** ఇటీవల సిద్దిపేట జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండలంలోని గోపాలరావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన ఈ శశివర్ధన్ (8వ) అండర్ 14 విభాగంలో ప్రతిభను కనబరిచి 25, 26, 27 తేదీల్లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిర్వహించబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సంధర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి విధ్యార్థికి బొకే అందజేసి అభినందించారు. చదువుతో పాటు క్రీడలలో మంచి నైపుణ్యాలతో ముందడుగు వేయాలని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని విధ్యార్థులకు సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజా పక్షం/గంభీరావుపేట : గంభీరావు పేట మండలం రాజేశ్వరావు కాలని కి చెందిన చెల్ల రమేష్ (33) శుక్రవారం రాత్రి సిరిసిల్ల వైపు తన పోలంవ వద్ద కు వెలుతున్న సమయంలో రాత్రి 11 గంటలకు ప్రధాన రహదారిపై గ్రామ సమీపంలోని దుర్గమ్మ గుడి వద్ద కామారెడ్డి వైపు వెలుతున్న బిక్కనూరు గ్రామానికి చెందిన సందీప్ అతి వేగంగా అజాగ్రత్తగా వాహనంతో రామేష్ కు ట కృరించగ అక్కడికక్కడే రా మేష్ మృతి చేందడని తన భార్య పిర్యదు మే రకు కేసు నయోదు చేసి విచారణ చేపట్టిన ట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతునికి ఇ ద్దరు కుతూరులు, ఒక్క కుమారుడు ఉన్నా రు.

# దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత

వొడ్నాల యగ్నేష్

ప్రజాపక్షం/గంగాధర:గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామంలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి చొప్పదండి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుడు వొడ్నాల యగ్నేష్ రూ.20 వేలను విరాళంగా అందజేశారు. మాజీ సర్పంచ్ బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మోతె నరసింహారెడ్డి, మాజీ ఎంపిటిసి ముద్దం నగేష్, విజయేందర్, దోమకొండ మహేష్, కిషన్, పిట్టల మల్లేశం, ఒడ్నాల వంశీ, కముటం శ్రీనివాస్,ఆముదాలరోహిత్‌రెడ్డి తదితరులున్నా రు.

# మద్యం తాగి వాహనాలు నడపరాదు



ప్రజాపక్షం/లోకేశ్వరం :మండల కేంద్రంలోని అవర్గ ఎక్స్ రోడ్ వద్ద ఎస్సై అశోక్ ,ఎఎస్ఐ దిగంబర్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు,వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలు వెంబట ఉంచుకోవాలని హెల్మెట్ ధరించాలని త్రిబుల్ రైడింగ్ చేయరాదని నియమ నిబంధనలు పాటించాలని పాటించనిచో చర్యలు తప్పవని తెలియజేశారు.అలాగే మైనర్ల కు వాహనాలు ఇవ్వకూడదని తెలియజేశారు.

# టిప్పర్, జెసిబి సీజ్

- పెద్దపల్లి మైనింగ్ ఎడి శ్రీనివాస్

ప్రజాపక్షం /పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి మండలం తురకల మద్దికుంట గ్రామంలో శుక్రవారం రాత్రి అక్రమ మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను జెసిబి సీజ్ చేసినట్లు పెద్దపల్లి మైనింగ్ ఎడి శ్రీనివాస్ తెలిపారు.పెద్దపల్లి మండలంలోని తురుకల మద్దికుంటలో రాత్రిపూట అక్రమంగా జెసిబితో తోడి టిప్పర్ లో మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా మైనింగ్ ఏడి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి మాటు వేసి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ ను జెసిబిని పట్టుకొని సీజ్ చేసి పెద్దపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రిపూట ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎడి శ్రీనివాస్ హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటగిరి, స్ఆర్ఓలు , శ్రీకాంత్ ఉన్నారు.

# పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :శ్రీరాంపూర్ ప్రాంతం బస్టాండ్ సమీపంలో గల దుకాణదారులు రోడ్డుకు దగ్గరగా షాపులను పెట్టడం వలన షాప్‌కు వచ్చేవారు వాహనాలను ఎదురుగా నిలపడంతో రద్దీ కారణంగా రహదారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని శ్రీరాంపూర్ సిఐ వేణుచందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్, సిబ్బందితో కలిసి శనివారం స్థానిక దుకాణదారులకు షాపులను వారి పరిధి లోపల న దుపుతూ పార్కింగ్ సమస్యలు తలెత్తకుండ రహదారి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిర్లక్ష్యంగా నిలపడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పైన చట్టపరమైన కేసులు పెడతామని హెచ్చరించారు. అలాగే ప్రతి షాపు యాజమానులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోపోలీసు సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

సిరిసిల్ల పట్టణ సిఐ కృష్ణ





ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :జిల్లాఎస్‌పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణం లోని నేతన్న చౌక్ లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులచే ఫ్లాష్ మాబ్ కార్యక్రమం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియమాలు, రోడ్ ప్రమాదాల నిర్మూలనకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ఫ్లాష్ మాబ్ కార్యక్రమంలో ఫ్లొకార్డ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం సి.ఐ కృష్ణ మాట్లాడుతూ, ప్రతి వాహన దారుడు ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, బయటకు వెళ్ళిన తన కోసం కుటుంబ సభ్యులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తారన్న విషయాన్ని వాహనదారులు గుర్తించాలని, అనుకొని ప్రమాదాల వల్ల కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ప్రతి వాహన దారుడు తప్పకుండా హెల్మెట్, షీట్ బెల్ట్ ధరించాలని, అతి వేగం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం త్రాగి డ్రైవింగ్ చేయటం, మొబైల్స్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయటం వంటివి చేయవద్దని,రాంగ్ రూట్ లో వాహనాలు నడుపవద్దని ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ ,రోడ్ భద్రత నియమాలు పాటించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఉన్నారు.

# మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన

ఫిట్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి దుస్స కుమార్

ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ : ప్రతిజ్ఞ దివాస్ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని కోసిని సమీపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన వచ్చిందని ఫిట్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి దుస్స కుమార్ అన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రక్తదానం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం ఫిట్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి దుస్స కుమార్ మాట్లాడుతూ రక్తదానంతో మరొకరి జీవితానికి వెలుగును నింపవచ్చని తెలిపారు. సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి వారికి రక్తం ఉపయోగుతుందని అన్నారు. రక్తదాన శిబిరంలో 100 యూనిట్ల బ్లడ్‌ను సేకరించడం జరిగిందని తెలిపారు. రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రక్తదాతలకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఫిట్ ఇండియా సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్‌కి సన్మానం



ప్రజాపక్షం/చిగురుమామిడి:హుస్నాబాద్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా చిగురుమామిడి మండల కాంగ్రెస్ నాయకులు ఆయన స్వగృహంలో శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి భారతీదేవి, ఎండి కుతుబుద్దీన్, బొడిగె పరశురాములుకు మార్కెట్ కమిటీ లో సభ్యులుగా అవకాశం కల్పించినందుకు మంత్రి పొ న్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ సెల్ మ ం డల అధ్యక్షుడు ఎండి షాబుద్దీన్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షు డు అందె మేకల పర్శరాములు, గ్రామ అధ్యక్షుడు ఎనగ oదులలక్ష్మ ణ్, నాయకులు ప్రవీణ్, రాజయ్య, గందెరాజ య్య, ఆది మల్లయ్య, నాగరాజు, కనకయ్య తదితరులున్నా రు.

# మా బిడ్డను కాపాడండి సారు..

ప్రజాపక్షం/ వాంకిడి :కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో గత నెల 29వ తేదీన ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన విద్యార్థి శైలజ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఫుడ్ ఫాయిజన్‌తో అస్వస్థతకు గురైన శైలజను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా శైలజ తల్లిదండ్రులు మా బిడ్డను కాపాడండి సారు.. బిడ్డతో మాట్లాడి 15 రోజులు అవుతుంది ఎప్పుడు మాట్లాడుతుందో అని 15 రోజులుగా ఆసుపత్రి తలుపుల వద్ద వేచి చూస్తున్నాం అంటూ పరామర్శించడానికి వెళ్లిన వారితో చెప్తూ రోధిస్తున్న తీరు పలువురి కంటకన్నీరు తెప్పిస్తుంది. తమకు ఉన్నది ఒకే బిడ్డ అని, ఉన్నత చదువులు చదివించి మంచి స్థానంలో చూడాలనుకున్నామని, కానీ ఇలా ఆసుపత్రిలో బెడ్ పై చూస్తుంటే ప్రాణాలు పోతున్నాయి అని ఆవేదను వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి శైలజ అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరి రెండు వారాలు దాటిన ఆరోగ్యం ఏ మాత్రం మెరుగుపడక పోవడంతో ఏమి అవుతుందో అని కన్నీరు కారుస్తున్న తీరు అందరినీ కలిచివేస్తుంది. తల్లిదండ్రుల రోధనలు విన్న మండల వాసులు విద్యార్థి శైలజ ఆరోగ్యం మెరుగై క్షేమంగా ఇంటికి రావాలని కోరుతున్నారు.

# వాహనం ఢీకొని యువకుని మృతి

ప్రజాపక్షం/కొత్తపల్లి:గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కొత్తపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం రామడుగు మండలం దేశరాజ్‌పల్లికి చెందిన గజ్జల రాజశేఖర్ (27) తన స్నేహితులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై దేశరాజ్‌పల్లి నుంచి కొత్తపల్లికి వస్తుండగా ఎస్సారెస్పీ కాలువ వద్ద గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొనడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

# కరాటేలో సత్తాచాటిన సెయింట్ జార్జ్ విద్యార్థులు



ప్రజాపక్షం/కొత్తపల్లి:కాంటినెంటల్ షోతోకాన్ కరాటే దు ఇం డియా అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్‌లో ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు చైర్మన్ డాక్టర్ పాతిమా రెడ్డి తెలిపారు. అశ్విత్ రెడ్డి(3వ) బంగారు పతకం, వెండి పతకం, శ్రీకృతి(8వ) వెండి పతకంతో అద్భుత ప్రదర్శన కనబర్చినట్లు తెలిపారు. కరాటేను ప్రతిరోజు క్రమశిక్షణగా నేర్చుకుని కష్టపడి విజయాన్నిసొంతం చేసుకున్నారన్నారు. వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదపుటంచున పాఠశాల ప్రహరీ..



ప్రజాపక్షం/సోన్ :మండలంలోని న్యూవెల్మల్ గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో ని ప్రహరీ గోడకు పగు ళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది.ప్రమాదం జరగకముందే దీ నిని పట్టించుకొనిసరిచేయాలనిపలువురు అభిప్రాయం వ్యక్తం చే శారు.

# సిఐటియు కార్యాలయం ప్రారంభం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నన్న..

ప్రజాపక్షం /తలమడుగు :సిఐటియు జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి కార్మికులు తరలిరావాలని,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నన్న తలమగుడు మండల కేంద్రంలో దుకాణాలలో విరాళాలను సేకరించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ కార్మిక కర్షకుల కోసం నిరంతరం పనిచేస్తున్నసిఐటుయు జిల్లా కేంద్రాన్ని నిర్మించుకొని ఈనెల 28న ప్రారంభోత్సవానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేంద్ర కమిటీ సభ్యులు వస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రానికి విరాళాలు అందించిన దాతలు,కర్షకులు ప్రారంభోత్సవానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లుమంజుల,రమణ,అనసూయ,లక్ష్మి ,దివ్య,ఆడేళ్లపాల్గొన్నారు.

# కిడ్నీలు చెడిపోయి మహిళ మృతి

ప్రజాపక్షం/శంకరపట్నం:శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి భూలక్ష్మి(50) రెండు కిడ్నీలు చెడిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి భూలక్ష్మి కిడ్నీ సమస్యతో కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందగా మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరించగా శుక్రవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ రెడ్డి భూలక్ష్మి మృతి చెందింది. రెండు కిడ్నీలు చెడిపోయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి పట్ల కుటుంబంలో విషాదం అలుముకుంది. భూలక్ష్మి అంత్యక్రియలనుశనివారంబంధువులు నిర్వహించారు.

## లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో పరిశుభ్రత ఎక్కడ..?



**ప్రజాపక్షం/బీర్‌పూర్:** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం కేంద్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిత్యం భక్తులు అలాగే విహారయాత్రకి విద్యార్థిని విద్యార్థులు పాఠశాలల నుండి నిత్యం వస్తు కొండపై ఉన్న స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసి అనంతరం వన భోజనానికి కొండపైకి నుంచి కిందికి వచ్చి రథశాల కళ్యాణ మండల సమీపాన షెడ్లలో భోజన కార్యక్రమాలు చేస్తు పిల్లలు ఆటపాటలతో కార్యక్రమం ముగుస్తుంది. ఎన్ని లక్షలు వచ్చిన ఎంతమంది దాతలు ముందుకు వచ్చి షెడ్లు నిర్మించిన ఇక్కడ ఆలయ అధికారులు మాత్రం వచ్చిపోయే భక్తులకు పరిశుభ్రత లోపించి చెత్తచెదారం వేయడంతో వాసనతో వచ్చే భక్తులకు చాలా ఇబ్బందిగా ఏర్పడింది. చెత్త చెదారం వేయడంతో ఆ పరిసరాలలో చాలా దుర్వాసన రావడం ద్వారా చాలా మంది భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా గుట్ట కింది సమీపంలో చెత్త చెదారంలేకుండా పరిశుభ్రంగా చూసుకోవాలని నరసింహస్వామి భక్తులు కోరుతున్నారు.

## కేశవ చంద్ర రమావత్ చిత్రాన్ని ఆదరించి ఆశీర్వదించండి..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్,జబర్దస్త్ రాకిం నిర్మించిన కేశవ చంద్ర రమావత్ చిత్ర యూనిట్ పర్యటించి ఖానాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ భూక్య జన్సన్ నాయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమం అనంతరం ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేశారు.చిత్ర హీరో రాకింగ్ రాకేశ్,అనన్య కృష్ణన్ జంటగా తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవల విడుదల అయ్యింది అని రాకింగ్ రాకేష్ తెలిపారు.చక్కగా రూపొందిన ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని అందరి అభిరుచిగల అంశాలు ఈ చిత్రంలో వున్నాయి ఖానాపూర్ నియోజకవర్గంలో కెసిఆర్ ఎంతగానో అభిమానించే ప్రేక్షకులున్నారని తప్పక ఆదరిస్తారని అయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు పూర్ణచంద్ర నాయక్,పార్టీ సీనియర్ నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోజు రోజుకు పెరిగిపోతున్న కుక్కల బెడద



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల పట్టణంలోని పలు ప్రాంతాలలో రోజు రోజుకు కుక్కల బెడద ఎక్కువవుతుంది. పట్టణంలోని కూరగాయల మార్కెట్, చింతపండు వాడ, ఐబి ప్రాంతంతో పాటు తదితర ప్రాంతాల్లో ఈ కుక్కల బెడద ఎక్కువయిందని ప్రజలు వాపోతున్నారు. రోజు రాత్రి సమయాల్లో ఈ కుక్కలు అరపులు ఎక్కువవుతున్నాయి, పగటి పూట కూడా ఈ మార్గాల్లో కుక్కల స్వైర విహారం వల్ల పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు గుంపులు గుంపులుకు కుక్కలు వీధుల్లో తిరుగుతుంటే మరో వైపు ఇందులో కొన్ని కుక్కలు వింత వ్యాధులు సోకి బక్కచిక్కి చూడటానికే అసహ్యంగా తయారయ్యాయి. ఇలా వీధుల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కల వల్ల ఇప్పటికే కొంత మంది కుక్కకాటుకు గురై ఆసుపత్రుల చుట్టు తిరిగిన వారు ఉన్నారు. దీనికి తోడు ఇళ్ళలో పెంచుకునే పెంపుడు కుక్కల వద్దకు ఈ కుక్కలు వస్తే వాటికి కూడా వింత రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని పెంపుడు కుక్కలను పెంచుకునే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వీధి ఇష్టానుసారం వీధుల్లో తిరుగుతున్న వీధి కుక్కలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాయల్ చోరి



**ప్రజాపక్షం/ మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం రోజు పుంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుంచి విద్యుత్ వైర్ కాయల్ని దొంగిలించినట్లు మోర్తాడ్ ఎలక్రిసిటీ ఎఈ రమేష్ మోర్తాడ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా మోర్తాడ్ ఎస్సై విక్రమ్ శనివారం రోజున సంఘటన స్థాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ట్రాన్స్ఫార్మర్ల వద్ద కొత్తవారు కనిపిస్తే సమాచారం ఇవ్వండి..**

మోర్తాడ్ మండలంలోని వివిధ గ్రామాలలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఉన్న చోట ఎవరైనా కొత్తవారు కనిపిస్తే అట్టి విషయమై మోర్తాడ్ విద్యుత్ అధికారులకి గాని లేదా మోర్తాడ్ పోలీస్ శాఖ అధికారులకు గాని సమాచారం అందించి ట్రాన్సాఫార్మర్లు దొంగతనానికి గురికాకుండా ప జలు తమ వంతు సహాయ సహకారాలు అందించవాల్సిందిగా వివిధ గ్రామాల ప్రజలకు విద్యుత్ అధికారులు తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ పరిష్కారం చూపే ఏకైక సంఘం




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పిఆర్‌టియు జిల్లా కార్యాలయంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో నిర్వహించి మాట్లాడారు. పిఆర్‌టియుకు చెందిన అభ్యర్థి ఎమ్మెల్సీగా ఉంటే అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వంగ మహేందర్‌రెడ్డి సమాజ సేవకుడని ఇతన్ని గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలు లేకుండా పని చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతుకగా పని చేస్తానన్నారు. పాత పిఆర్‌సి విధానం తీసుకరావటం 2003 డిఎస్‌సి అభ్యర్థుల సమస్యల పరిష్కారం, కెజిబివిఉద్యోగుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు గురుకులాల్లోని ఉపాధ్యాయులకు సమయపాలనలోని మార్పులు అనేక సమస్యల పరిష్కారం కృషి చేస్తానన్నారు. 33 జిల్లాల పీఆర్‌టీయు అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేతుందుకు పూర్తిస్థాయిలో మద్దతు తెలుపడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే పదోన్నతులు బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయుల వెంటనే ఉండి ఎలాంటి సమస్య రాకుండా నిరంతరం పని చేయటం జరిగిందన్నారు. జిల్లాలో 90 శాతానికి పైగా పిఆర్‌టియుకు చెందిన ఉపాధ్యాయులున్నారని, పిఆర్‌టియు బలమైన సంఘంగా కొనసాగుతుందన్నారు. 24న జిల్లా కేంద్రంలోని బిఎల్ఎన్ గార్డెన్‌లో నూతనంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులందరికి ఘనసన్మానం చేపడుతున్నామన్నా రు. ఉపాధ్యాయులు అందరూ హాజరు కావల ని కోరుతున్నామన్నారు. విలేకరుల సమావేశంలో పిఆర్‌టి యు ప్రధాన కార్యదర్శి కిషన్, హైదరాబాద్ పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా పిఆర్‌టియు నాయకులు మురళి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పోరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వ ఆస్పత్రిని బలోపేతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంధ్యారాణి, సాయిబాబా అన్నారు. శనివారం పీవైఎల్, పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఆస్పత్రి బలోపేతం చేయాలని ప్రైవేట్ కార్పోరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నగరంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్యపరీక్ష సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న డాక్టర్స్, నర్సుల ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, ఆధునిక వైద్య పరికరాలతో సూపర్ స్పెషాలిటీలతో వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఏరియా ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించి డాక్టర్లకు నర్సులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లలిత, అమూల్య, మహేష రాజు, రజిత, అక్షయ, దేవిక, నర్సవ్వ, బేగం పాల్గొన్నారు.

## ఫుడ్ ఫెస్టివల్ క్విజ్ నాటక ప్రదర్శన

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండలంలోని సాతారం ప్రభుత్వ ప్రయిమరీ పాఠశాలలో నో బ్యాగ్స్ డే సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నాటక క్విజ్ పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నైపుణ్యత లక్షణాలను పెంచడంలో ఉపయోగపడతాయని ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంబాటి భూమేశ్వర్, సదాశివ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు దీపక్, రవళి, రాజ్యలక్ష్మి, హేమ రేవతి తదితరులు ఉన్నారు.

## కేంద్ర నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజా పక్షం/గంభీరావుపేట :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం రోజున గంభీరావుపేట మండలంలో కేంద్ర నిధులు 23 కోట్లతో లభివృద్ధి పనులను శ్రీకారం చుట్టారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు లింగన్నపేట నుండి కోరుట్లపేట వరకు రోడ్డు. గంభీరావుపేట నుండి మల్లారెడ్డిపేట వేల్లె దారిలో ఉన్న వాగుపై బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కూడా బీఆర్ఎస్ తోవలో నడుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల నయకులు పాల్గోన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్..

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంతో పాటు నగర్ కిష్టాపూర్ గ్రామాలలోని వరి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలని మిల్లులకు పంపిన రైతుల ధాన్యం వివరాలు వెంటనే ట్యాబ్ లో ఎంట్రీ చేయాలని రైతులకు సరైన సదుపాయాలు కల్పించాలని తదితర సమాచారం తెలియజేశారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలకు అక్షర విద్యార్థిని ఎంపిక

**ప్రజాపక్షం/రామడుగు:** స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలోని లుథియానాలో నిర్వహిస్తున్న కరాటే టోర్నమెంటులో మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందని అక్షర హైస్కూల్ విధ్యార్థిని కమటం అద్వైత అండర్ 14 బాలికల విభాగంలో మైనస్ 22 బరువు విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికయ్యింది. ఈ సంధర్బంగా కరీంనగర్ జిల్లా పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి విద్యార్థినిని అభినందించి జాతీయ స్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షిచారు. అక్షర హైస్కల్ చైర్మన్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ, కరాటే జనరల్ సెక్రటరీ డాక్టర్ఐలయ్య, ఇంటర్నేషనల్ జపాన్ బ్లాక్ బెల్ట్ డిప్లమాకోచ్‌రాజు,తల్లిదండ్రులుకమటం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/చొప్పదండి:** స్వేరోస్ ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను చొప్పదండి అంబేద్కర చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యా విధానంలో పెనుమార్పులను తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఉద్యోగంలో, రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకెళ్తున్నారన్నారు. స్వేరోస్ అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి కళ్లెపల్లి అరవింద్, స్వేరోస్ పట్టణ అధ్యక్షుడు కొత్తూరి శ్రవణ్, ఇరుగురాళ్ల రమేష్, మాచర్ల రోహిత్, కనకం శ్రీను, తాండ్ర లూకా, కళ్లెపల్లి రిషి, స్వేరోస్ ఫిట్ ఇండియా సభ్యులు పాల్గొన్నారు.

## బిసిల సమరభేరి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 25న జరిగే బిసిల సమరభేరిని విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ కోరారు. శనివారం లక్ష్మీనారాయణ జగిత్యాలలో మాట్లాడుతూ పార్లమెంట్ లో బిసి బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు కుల గణన ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి రాష్ట్ర ప్రభుత్వం బిసిల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు బొమ్మిడి నరేష్‌కుమార్, బండపెల్లి మల్లీశ్వరి, రామచందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు

## మంచిర్యాలలో అఘోరీల హల్‌చల్



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల పట్టణంలో పలువురు అఘోరీలు ప్రధాన రహదారుల్లోని దుకాణాల వద్దకు వెళ్తు శనివారం హల్‌చల్ చేశారు.తాము హిమాలయాల నుండి వచ్చామని, అఘోరీలని చెప్పుకుంటు ఒక బోలోరో వాహనంలో తిరిగారు.ముగ్గురు అఘోరీలతో పాటు నలుగురు స్వాములు ఈ వాహనంలో చక్కర్లు కొడుతూ కొన్ని దుకాణాల వద్ద ఆగి బిక్షాటన చేశారు.కొంత మంది డబ్బులు ఇచ్చిన తీసుకోకుండా బియ్యం మాత్రమే తీసుకుని తాము అఘోరీలని వింతబాషలో చెప్పుకున్నప్పటికి ఎవరికి అర్థం కాలేదు. కానీ మంచిర్యాలలో ఇంత మంది ఉండగా తమ దుకాణాల వద్దకే వచ్చి అఘోరీలు దీవెనలు ఇచ్చారని కొంత మంది సంతోష పడగా మరికొందరు ఇలాంటి వారిని నమ్మవద్దని కొట్టిపారేయడం కొసమెరుపు.

## డ్రాయింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్ సంస్థ వారు నిర్వహించే ఎనర్జీ కన్జర్వేషన్ అనే అంశంపై జడ్పీహెచ్‌ఎస్‌లో చదివే విద్యార్థులు మధుప్రియ, సాత్విక్ రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎన్నికైనట్లు తెలిపారు. వీరిని డ్రాయింగ్ ఉపాధ్యాయులు తర్ల రమేష్, ప్రధానోపాధ్యాయులు సురేష్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం అభినందించారు. సోమవారం జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జడ్పీహెచ్‌ఎస్ అమ్రాద్ విద్యార్థులు పాల్గొనడం జిల్లాకే గర్వకారణమని డీఈఓ కొనియాడారు. అంతేగాకుండా విద్యార్థులు జాతీయస్థాయిలో కూడా రాణించాలని డీఈఓ విద్యార్థులను డ్రాయింగ్ టీచర్ రమేష్‌ను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, డ్రాయింగ్ టీచర్ రమేష్, డీసీఈబీ సెక్రటరీ సీతయ్య, విద్యార్థులు మధుప్రియ, సాత్విక్ పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ బాక్సింగ్ జోనల్లో విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన అండర్ 17,19, బాల బాలికల బాక్సింగ్ పోటీల్లో అండర్ 19లో ఎం.రమ్యశ్రీ, బి.స్నేహ,రెండు బంగారు పతకాలతో పాటు, జి.రజినీ, వెండి పథకం సాధించగా అండర్ 17 విభాగాల్లో ఎన్.అక్షయ, ఎస్.అడేల్ల బంగారు పతకాలు సాధించారు.4 బంగారు పతకాలు 1 వెండి పథకం సాధించినా విద్యార్థులకు కస్తూర్బా పాఠశాల స్పెషల్ అధికారి ఎం.అపర్ణ, పి.ఈ.టి.ఏ.జయ, ఉపాధ్యాయ బృందం బాక్సింగ్ జిల్లా సెక్రెటరీ చందు స్వామి అభినందనలు తెలిపారు.

# మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలపై ధర్నా...



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎన్ లక్ష్మణ్ మండల విద్యాధారికి శనివారం రోజున వినతి పత్రాన్ని అందించారు. అనంతరం కార్మికుల సమస్యలపై వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని,కోడి గుడ్లు పెట్టాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినప్పటికి ఎటువంటి స్పందన లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కోడిగుడ్లు మార్కెట్‌లో ఏడు రూపాయలు ఉండగా, ప్రభుత్వం ఐదురూపాయల నలబైఅయిదు పైసలు చెల్లిస్తుందని, నిత్యఅవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా,అప్పులు చేస్తూ వంట కార్మికులు నష్టాన్ని చవిచూస్తున్నారు. అయిన్నప్పటికి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నమన్నారు. ప్రభుత్వం మిడ్ డే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 10, 11 తేదిలలో పెద్దఎత్తున ఆందోలన చేస్తామని అధికారులకు విన్నవించారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ అనుసరించి డ్రెస్‌కొడ్, ఫిఎఫ్, ఇన్సురన్స్ మరియు నెలకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిడ్ కార్మికులు లక్ష్మి నర్సవ్వ, గంగవ్వ, లత,విజయ,సరోజన,శంకర్,నిర్మల,రజిత వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

## మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ పూర్తిఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ షురూ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సమగ్ర ఇంటింటి కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కు సర్వేలో భాగంగా సర్వే పూర్తయిన కుటుంబాల యొక్క సమాచారాన్ని కంప్యూటర్ ఆన్లైన్ సాఫ్ట్వేర్ లో నమోదు చేసేందుకు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి చేశామని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని 28 మంది మాస్టర్ ట్రైనర్లకు సర్వేలో సేకరించిన డాటా ఆన్లైన్ లో నమోదు చేసే విధానం పై శనివారం అదనపు కలెక్టర్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి మండలానికి ఇద్దరు అలాగే ప్రతి మున్సిపాలిటీకి నలుగురు చొప్పున మొత్తం 28 మంది మాస్టర్ ట్రెయినీలకు రాజన్న సిరిసిల్ల కేంద్రంలో శిక్షణ పూర్తి చేశామని వివరించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు మండల కేంద్రాలు, జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన 480 మంది ఆపరేటర్లకు సర్వేలో భాగంగా సేకరించిన అంశాల డాటా ఎంట్రీ పై శిక్షణ ఇచ్చారని తెలిపారు. శిక్షణ పొందిన ఆపరేటర్లు డాటా ఎంట్రీ శనివారం (ఈ రోజు) నుంచి జిల్లాలో ప్రారంభించారని వెల్లడించారు.

# బిజెపికి వ్యతిరేకంగా 26న దేశవ్యాప్త నిరసనలు

**ప్రజాపక్షం/మంచిర్యాల బ్యూరో:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజాస్వామ్య హక్కులను కాపాడకోవాలనే లక్ష్యంతో ఈ నెల 26వ తేదీన దేశవ్యాపితంగా జరిగే నిరసనలలో ప్రజలు పాల్గోని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కోరారు. శనివారం మంచిర్యాల బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశవ్యాప్త నిరసనల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్పోరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని స్వావలంబనను తాకట్టు పెడుతుందని ఆరోపించారు. సామాన్యులకు ఆర్థిక భారాలు పెట్టుబడుదారులకు కార్పోరేట్లకు బడా వ్యాపారస్తులకు లాభాలుకట్టపెట్టే విధంగా మోడీ సర్కార్ కేంద్రంలో బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ వినాశకర చర్యలను కార్మికవర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మిక సంఘం ఐక్యంగా ధీటుగా ఎదుర్కొవాలని నవంబర్ 25 మండల కేంద్రాలలో 26వ తేదీన జిల్లా కేంద్రాలలో నిరసనలకు ఐక్యవేదికగా ముందుకు రావాలని సిఐటియు పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కావేరి రవి, వెంకటేష్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25న హైదరాబాద్‌లో బిసిల సమరభేరీ

**ప్రజాపక్షం/పిట్లం:** జాతీయ బీసీ సంక్షస్త్రమసంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీసీల సమరభేరీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు పిట్లం మండలకేంద్రంలో శనివారం నాడు జాతీయ బీసీ సంక్షేమసంఘం పిట్లం శాఖ ఆధ్వర్యంలో గోడప్రతులను ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో చేపట్టబోయే బీసీ సమరభేరీ సభకు బీసీలు, బహుజనులు అత్యాధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ర్టట ఉపాధ్యక్షులు కాముని సుదర్శన్ నేత ఆదేశానుసారం జిల్లాలోని అన్ని గ్రామాల, మండల నియోజకవర్గాల నుండి అందరూ బీసీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు చింతల శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లోక సంతోష్ నేత, జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జీ ఆకుల లక్ష్మణ్‌యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాకలి అశోక్‌రాజ్, గూడ నర్సింలు, ఎర్ర రమేష్, బన్నీ సాయిలు, మేకల విఠల్, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్‌ఆర్ కాలనీ లో శునకాలతో తనిఖీలు





**ప్రజపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో గల వైఎస్‌ఆర్ కాలనీలో పోలీస్ జగిలాలతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ గంగారెడ్డి నేతృత్వంలోని నిర్మల్ రూరల్ ఇన్స్పెక్టర్ టీం విస్తృత తనిఖీలు చేపట్టటం జరిగింది.మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలన్న సంకల్పంతో జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని,జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ,మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందన్నారు. గంజాయి,డ్రగ్స్ సేవించే, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గతంలో ఈ కేసులలో నిందితులుగా ఉన్న వారికి వారి తల్లి దండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ తో పాటు,అవగాహన కల్పిస్తున్నామన్నారు.జిల్లాలో మాదక ద్రవ్యాలు విక్రయించిన,సాగు చేసిన,సేవించిన,రవాణా చేసిన వారి సమాచారం తెలపాలని, ఈ తనిఖీల్లో ఇస్పెక్టర్లు ప్రేమ్ కుమార్, ప్రవీణ్ కుమార్,రామ కృష్ణ ,ఎస్ఐలు లింబాద్రి,రవి కుమార్,జిల్లా డాగ్ స్క్వాడ్ టీం తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్ కోటకు హరీష్ రావు రాక..!



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ట్రబుల్ షూటర్ తన్నీరు హరీష్ రావు ఆదివారం హుజురాబాద్‌లో పర్యటించనున్నారు. ఇక్కడికి వస్తున్న హరీష్ రావుకు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆద్వర్యంలో గులాబీ దండు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుంది. హరీష్ రావు ఆదివారం ఉదయం హైదరాబాద్ నుండి వీణవంకకు చేరుకుంటారు. అక్కడ అల్పాహారం చేసిన అనంతరం సందర్శకులతో మాట్లాడి జమ్మికుంట మీదుగా హుజురాబాద్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. హరీ ష్ రావు హుజురాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో పెద్ద ఎతుత్న ఆయనకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీష్ రావు హుజురాబాద్ నియోజకవర్గంలో పర్యటించడం పై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. తన దూకుడుతో అధికార పార్టీని గడగడలాడిస్తున్న కౌశిక్, సొంత నియోజకవర్గమైన హు జురాబాద్‌లో ఆయన పర్యటిస్తుండడం గమనర్హం. కాంగ్రెస్ ప్రభు త్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో స్పష్టమైన వ్యతిరేకత కనిపిస్తున్న నేపథ్యంలో హరీష్ రావు పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## కుక్క దాడిలో 24 గొర్రె పిల్లలు మృతి



**ప్రజాపక్షం/భైంసా :** భైంసా మండలంలోని ఇలేగాం గ్రామంలో ఘోరం చోటు చేసుకుంది.గొర్రెల కాపరులు గొర్రె పిల్లలను ఇంటివద్ద ఉంచి వెళ్లడంతో కుక్క దాడి చేసి ఏకంగా 24 గొర్రె పిల్లలను చంపేసింది.గ్రామానికి చెందిన చౌలా గజ్జరామ్,చౌలా సాయిలు అనే గొర్రెల కాపరులకు భారీగా నష్టం జరిగింది.ఊర కుక్క మెడ భాగాన్ని కరవడంతో రక్త స్రావం జరిగి గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి.దీంతో గొర్రెల కాపరులు కంట నీరు పెట్టుకున్నారు.

## విడతల వారీగా బ్యాంకు రుణాలు మంజూరు

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** విడతల వారిగా బ్యాంకు రుణాలను మంజూరు చేస్తామని, రుణదాతలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందవచ్చని ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ గోపాల్ అన్నారు. వీధి వ్యాపారులు బ్యాంకు రుణాల మంజూరు కొరకు దరఖాస్తు చేసుకోగా బ్యాంకు మేనేజర్ సిబ్బందితో కలిసి శనివారం బి జోన్, రాజీవ్ చౌక్ చౌరస్తాలో గల వ్యాపారస్తుల యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ మేనేజర్ మాట్లాడుతూ వ్యాపారస్తులకు త్వరలోనే మొదటి, రెండవ, మూడవ విడతల వారీగా బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నామని, ఇంతకుముందు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే వాటి పై తక్కువ వడ్డీ, క్యాష్ బ్యాక్ వర్తిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎమ్‌సి శ్రీధర్, మెప్మా ఆర్‌పిలు మంగ, సుజాత, స్వప్న, రమాదేవి, శ్యామల పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు, సనాతన ధర్మం ఆచరిస్తున్న వారందరిపై ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి అన్నారు. ధర్పల్లి మండలం గోవింద్‌పల్లిలో గత మూడు రోజుల నుండి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు కన్నుల పండగగా నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారి కళ్యాణానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి పాల్గొని కళ్యాణాన్ని తిలకించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ,గ్రామకమిటీ సభ్యులను దినేష్ కులాచారిని ఘనంగా సన్మానించి మాట్లాడారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వేడుకలు ఘనంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొల్ల రాజగణేష్, కర్రోల్ల శ్రీనివాస్, దొడ్డెనుక రాజేందర్, సంబేటి పెద్దనర్సయ్య, ఒడ్డేటి జలందర్, చెరుకు నడ్పి గంగారాం, ప్రజలు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ..



**ప్రజాపక్షం/తలమడుగు** :బారసా నాయకుడు ప్రవీణ్ కుమార్ జన్నదినమును తలమడుగు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా జిల్లా స్వేరోస్ అధ్యక్షుడు పెంటపర్తి ఆశన్న ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణి చేసి అనంతరం కేక్ కట్ చెయ్యడం జరిగింది.స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్న మాట్లాడుతూ సామజిక సేవ కార్యక్రమంలో స్వేరోస్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని దానిలో భాగంగా ప్రవీణ్ కుమార్ జన్నదిన సందర్భంగా సామజిక కార్యక్రమలు చెయ్యడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్,ఆశోక్,తరుణ్,ప్రేమ్ గంగన్న,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పరికరాలు అందజేత

**ప్రజాపక్షం/సోన్** :200910 బ్యాచ్ కు చెందినటువంటి పూర్వ విద్యార్థి శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్మల్ బొప్పారం నకు 5000 రూపాయలు విలువ గల క్రీడా పరికరాలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాలం విద్యాసాగర్ కు అందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ దాతకు సన్మానం..



**ప్రజాపక్షం/నేరడిగొండ**:నేరడిగొండ మండలంలోని తేజాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రతి సంవత్సరం విద్యార్థుల అభివృద్ధి కోసం తాను చదువుకున్న పాఠశాలకు నూతన కంప్యూటర్ ని సీనియర్ రీసర్చ్ సైంటిస్ట్ గ పనిచేస్తున్న తేజపూర్ గ్రామ సామ అజయ్ రెడ్డి,అందివ్వడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు మని లత,తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల సిబ్బంది చిరు సన్మానం చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పండ్ల పంపిణీ



**ప్రజాపక్షం /పెంచికల్‌పేట్** :మండలంలోని చేడ్వాయి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బిట్టు శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు మహేష్, దేవాజీ, రవి, చిన్నయ్య, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బైంసాలో బిజెపి విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే..



**ప్రజాపక్షం/బైంసా** :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం చేసినచోట మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ ఘెర పరాజయం పాలైందని నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు.మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి భారీ ప్రభంజనం సృష్టించడంతో బైంసాలోని ఎస్.ఎస్.జిన్నింగ్ ఫ్యాక్టరీలో టపాసులు పేల్చి,సంబరాలు జరుపుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు.బిజెపి ప్రభుత్వ హాయంలో మహారాష్ట్రలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయన్నారు.లాడ్ కీ బహిన్ పథకంతో 60 సంవత్సరాలు లోపు ప్రతి ఆడపడు చుకు మహారాష్ట్రలో నెలకు 1500 రూపాయలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వాని దేనన్నారు.మహాలక్ష్మి ,పథకం ఇస్తానని గద్దెనెక్కి,ఇప్పటికీ ఆడపడుచులకు ఎలాంటి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి మాటలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదాన్నారు.తెలంగాణలో ఏదో సాధించామని ఎన్నికల ప్రచారంలో తెలంగాణ మంత్రులు,ముఖ్యమంత్రి,అధికార పార్టీ నాయకులు తిరిగినా,వారి మాటలను నమ్మకుండా ప్రజలు బిజెపి కూటమికి పట్టం కట్టారన్నారు.విజయోత్సవ సంబరాల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా,బైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు,నాయకులు సోలాంకి భీమ్‌రావ్,శివాజీ పటేల్,బాజీ రావ్ పటేల్,వెంగల్ రావ్,కౌన్సిలర్లు,మాజీ సర్పంచ్‌లు,ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాంకుల కోసం ప్రాణాలతో చలగాటం




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్** :కార్పోరేట్ కళాశాలల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో కోటగల్లీ ఎన్ఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడారు. కార్పోరేట్ కాలేజీలో ర్యాంకుల కోసం విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్నాయన్నారు. ఈ రోజు హైదరాబాద్ శ్రీచైతన్య విద్యార్థి కౌశిక్ రాఘవ ఆత్మ హత్య చేసుకుని మరణించటానికి కాలేజీ యాజమాన్య ఒత్తిడే కారణమన్నారు. శ్రీచైతన్య నారాయణ తదితర కార్పోరేట్ కళాశాలలు ర్యాంకుల కోసం విద్యార్థులపై అధిక ఒత్తిడిని కలిగిస్తూ వేధిస్తున్నాయన్నారు. మార్పులు ర్యాంకుల కోసం కార్పోరేట్ కాలేజీల వేధింపులను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో వరుసగా ఈ ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం స్పందించకపోవటం సిగ్గుచేటన్నారు. వెంటనే శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తూ నాణ్యమైన భోజనం కనీస సౌకర్యాలు కల్పించకుండా కేవలం చదవడంపై ఒత్తిడి చేస్తూ విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా మార్కులు ర్యాంకులే ముఖ్యమైనట్లుగా భావిస్తుండటం బాధాకరమన్నారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడలు, మానసిక ఉల్లాసం అవసరమన్నారు. ప్రభుత్వం కార్పోరేట్ కళాశాలల ఆగడాలను నియంత్రించకపోతే మరిన్ని ఘటనలు జరిగే ప్రమాదముందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న కార్పోరేట్ కళాశాలల్లో వెంటనే తనిఖీలు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలను మూసివేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు మహిపాల్, నశీర్, సమీర్, శివ పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల సంబురాలు



**ప్రజాపక్షం/జమ్మికుంట**:మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో బిజెపి ఘన విజయం సాధించిన సంధర్బంగా బిజెపి జమ్మికుంట పట్టణ శాఖ అధ్యక్షుడు జీడి మల్లేష్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి పాలయ్యిందన్నారు. నాయకులు కోరె రవీందర్, పల్లపు రవి, కైలాష్ కోటి గణేస్, కొలకానిరాజు, మోతె స్వామి, ఇటికాల స్వరూప; తూడి రవిచంద్రరెడ్డి, మోడెం రాజు, రావుల శ్రీనివాస్, గిరవేణి విజేందర్, బూరుగుపల్లి రామ్, రాచపల్లి ప్రశాంత్, గర్రెపల్లి నిరూపారాణి, శివర్తి అఖిల్, పొనగంటి రవికుమార్, పుల్లూరి ప్రశాంత్, ఉడుగుల మహేందర్, అప్పల రవీందర్, వేముల జగన్, శ్రీవరి ప్రవీణ్, కేశ స్వరూప, ముకుంద సుధాకర్, విజిగిరి రవీందర్, కొండపర్తి ప్రవీన్, కన్నెబోయిన బద్రి, మంతిని అశోక్, మాదాడి సమ్మిరెడ్డి, ఆవంచ వెంకటేష్, యాంసాని సమ్మయ్య, వీణవంక శివ, బొజ్జ శరత్, రాంపల్లి రజిత, పుట్ట తిరుమల, చింతల శోభ, వెంకన్న తదితరులున్నారు.



**హుజురాబాద్ :** మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో బిజెపి/ఎన్డిఏ ఘన విజయం సాధించిన సందర్భంగా బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ అధ్యక్షులు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తెలంగాణ సియం రేవంత్ రెడ్డి స్వయంగా తిరిగి ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని, కాంగ్రెస్ దొంగ హామీలను ఎవరూ నమ్మలేదన్నారు. కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, కౌన్సిలర్ నల్ల సుమన్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, తుమ్మల శ్రీనివాస్, జిల్లా ఓబిసి మోర్చా ఉపాధ్యాక్షులు రావుల వేణు, పట్టణ ఓబిసి అధ్యక్షులు గంట సంపత్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బోరగాల సారయ్య, శ్రీనివాస్, ఆవుల సదయ్య, కొలిపాక వెంకటేష్, రాపాక రాజు, తాళ్లపల్లి దేవేంద్ర, తాళ్లపల్లి హరీష్, బోలగిరి రాజు, కుసుమ సమ్మయ్య, మహారాజ రాజు, బాబర్‌పాల్గొన్నారు.



**బోధన్**:మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడగా భారతీయ జనతా పార్టీ మిత్ర పక్షాలు అఖండ విజయం సాధించింది. మహారాష్ట్రలో బీజేపీ గెలుపుతో బోధన్ పట్టణంలో బీజేపీ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బాణా సంచాలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ బీజేపీ అధ్యక్షులు బాలరాజు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు సుధాకర్ చారిలు మాట్లాడుతూ భాజపా పార్టీకి పట్టం కట్టిన మహారాష్ట్ర వాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికల్లో దేశానికి మోడీ సారథ్యమే మంచిదని మహారాష్ట్ర ఓటర్లు ప్రజలు నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయ్, వాసు, అరవింద్, బోధన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి రామ్ పాల్గొన్నారు.

## ఎంపిని కలిసిన పిట్లం ఎఎంసి చైర్మన్



**ప్రజాపక్షం/పిట్లం:** జహిరాబాద్ ఎంపి సురేష్‌షెట్కార్‌ను పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా నియామకమైన చీకోటి మనోజ్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపికి మనోజ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. నూతనంగా ఎఎంసి చైర్మెన్, వైస్ చైర్మెన్లుగా ఎన్నికైన మనోజ్‌కుమార్, కృష్ణారెడ్డిలకు ఎంపి తమ అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, గుర్రపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షకై అభ్యర్థులకు ఉచిత ఫుల్ లెంత్ మాక్ టెస్ట్‌లు

**ప్రజాపక్షం/ మంచిర్యాల** :జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ (ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) యువతకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారిచే నిర్వహించబడుతున్న గ్రూప్2 సర్వీసెస్ పరీక్ష కొరకు 2 ఉచిత ఫుల్ లెంగ్త్ మాక్ టెస్ట్ లు నిర్వహించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ లోగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల ఎఫ్5 లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, మాక్ టెస్టు డిసెంబర్ 2, 3, 9,10తేదీలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4 :30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరముల కొరకు కార్యాలయంలో పని వేళలో, 85 55 917862నంబర్‌లోసంప్రదించవచ్చని,మైనారిటీయువతీ, యువకులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కోటి లలిత జప యజ్ఞం

**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురిలోని బ్రహ్మణ సంఘ భవనంలో ఆదివారం కోటి లలిత జప యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్యులు తెలిపారు. మండల ఆర్యవైశ్యులు, లలిత భక్తులచే విశ్వనాథం గురు పీఠం ఆధ్వర్యంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు లలితా పారాయణం, హోమం నిర్వహించడం జరుగుతుందని, లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ పుణ్య కార్యక్రమనికి భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## మాటేగం బ్రిడ్జిపై లారీ బోల్తా..

### డ్రైవర్‌కు స్వల్ప గాయాలు..

**ప్రజాపక్షం/బైంసా** :బైంసా మండలం మాటేగం వంతెనపై శనివారం ఉదయం గుజరాత్ నుండి విజయవాడకు టైల్స్ లోడ్ తో వెళ్తున్న లారీ బైంసా నిర్మల్ జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది దీంతో రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి ఈ ప్రమాదంలో డ్రైవర్ కు స్వల్ప గాయాలు కాగా ప్రమాద సమయంలో హైవేపై వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా అలర్ట్ నెట్ మార్గాల గుండా ప్రయాణికులను పంపిస్తున్నారు.సంఘటన స్థలంలో క్రేన్ సహాయంతో రహదారిపై అడ్డంగా ఉన్న లారీని నిమగ్నమయ్యారు.

